ప్రజాశక్తి
శనివారం 15 జూన్ 2024
8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

పల్లాకు టిడిపి రాష్ట్ర అధ్యక్ష పదవిపై హర్షం

వార్త 4లో..

సరిపడా రాని వరి విత్తనాలు

- వచ్చిన మేరకు రైతులకు సర్దుబాటు
- 22,376 క్వింటాళ్లకుగాను 11,250 చేరిక

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్‌కు రైతులు ఆకు మడులను దున్ని సిద్ధంచేశారు. వర్షాలు పడితే వరి విత్తనాలు వేయాలని చూస్తున్నారు. అయితే అటు వర్షాలూ లేవు. ఇటు ఎపి విత్తనాభివృద్ధి సంస్థ నుంచి సరిపడా విత్తనాలు జిల్లాకు చేరలేదు. జిల్లా వ్యవసాయశాఖ ఖరీఫ్ ప్రణాళికను సిద్ధంచేసి విత్తన ప్రతిపాదన చేసినప్పటికీ, ఈనాటికీ ప్రతిపాదనల్లో సగం వరి విత్తనం కూడా రాలేదు. ఇటీవల పడ్డ కొద్దిపాటి వర్షాలకు రైతులు ఆకు మడులు తయారుచేశారు. వర్షాలు మిగతా 2లో..

వార్త 2లో..

విధేయతకు ప్రాధాన్యత

అనితకు కీలకమైన హోంశాఖ
పార్టీ కార్యకర్తల్లో ఆనందం

రక్తదానం చేస్తున్న ఉక్కు ఉద్యోగులు

ఉక్కు కోసం

నాడు రక్త తర్పణం.. నేడు రక్తదానం

వార్త మెయిన్‌లో..

స్కూల్ బస్సులపై కొరడా

వార్త 2లో..

మొదటి పేజీ తరువాయి..

సరిపడారాని వరి విత్తనాలు

పడితే విత్తనాలు వేయాలని చూస్తున్నారు. అయితే సరిపడా విత్తనం రాకపోవడంతో వర్షం పడినా ఆకులు పోయలేమన్న ఆందోళన వారిని వెంటాడుతోంది. జిల్లాలోని 24 మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1.86 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. అందులో 1.32 లక్షల ఎకరాల్లో వరి సాగుకు వివిధ రకాల వరి విత్తనాలు దాదాపు 22,376 క్వింటాళ్లు అవసరమని క్షేత్రస్థాయిలో వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. జిల్లాలో వరి సాగు విస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకొని వ్యవసాయశాఖ కమిషనరేట్ జిల్లాకు 22,376 క్వింటాళ్ల వరి విత్తనాలు కేటాయించింది. అయితే అవసరంలో సగం వరి విత్తనాలు మాత్రమే జిల్లాకు చేరాయి. వర్షాలు పడే నాటికి వరి విత్తనాలు సిద్ధంచేసుకుందామన్నా, రైతు భరోసా కేంద్రాల్లో సరిపడా ఇవ్వడంలేదని రైతులు వాపోతున్నారు. వచ్చిన విత్తనాలు తక్కువ కావడంతో వున్న వాటిని రైతులకు సర్దుబాటు చేస్తున్నారు. 22,376 క్వింటాళ్ల వరి విత్తనాలకు 11,250 క్వింటాళ్లు వచ్చాయి. ఆకులుపోసే గడువు నాటికి విత్తనాలు అందజేస్తామని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

విత్తన రకం	కేటాయింపు	వచ్చినవి (క్వింటాళ్లలో)
ఆర్‌జిఎల్ 2537 (సిఎస్-8700)	8700	7796
ఆర్‌జిఎల్ 2537 (టిఎల్-4800)	4,800	-
బిపిటి 3291	1092	305
బిపిటి 5204	2268	1250
ఎంటియు 1061	592	207
ఎంటియు 1064	1800	466
ఎంటియు 1121	979	849
ఎంటియు 1224	940	54
ఎంటియు 1318	800	200
ఎంటియు 7029	340	100
ఎన్‌ఎల్‌ఆర్ 34449	17	-
ఆర్‌ఎన్‌ఆర్ 15048	48	18

దీక్షల్లో కూర్చున్న సిఐటియు నాయకులు

1171వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలుపుదల చేస్తున్నట్టు కేంద్రం ప్రకటించే వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని సిఐటియు జగదాంబ జోన్ అధ్యక్షులు వై.రాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలేదీక్షలు శుక్రవారానికి 1171వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వంలోని నాయకులు స్టీల్‌ప్లాంట్ పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చారని, ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి పనిచేయాలని అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. కార్యక్రమంలో మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.నర్సింగరావు, ఎర్రి బాబు, సంజయ్ పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స

- కంటిలోకి దూసుకు వెళ్లిన కర్ర ముక్క తొలగింపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్య ప్రదాయినిగా పేరుపొందిన కెజిహెచ్ చరిత్రలో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద శుక్రవారం మీడియాకు తెలిపిన సమాచారం ప్రకారం.. నర్సీపట్నం మండలం గురందలపాలెం గ్రామానికి చెందిన మీసాల నాగేశ్వరరావు (39) ఈ నెల 4న రాత్రి 9:30 గంటల ప్రాంతంలో ఇంటి మొదటి అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. ఆ క్రమంలో 12 అంగుళాల సరుగుడు కొమ్మ అతని కుడి కంటి నుండి మెదడు కింది భాగంలోకి చొచ్చుకుపోయింది. అతడు చూపును వెంటనే కోల్పోయాడు. మరుసటి రోజు అతన్ని కెజిహెచ్ ఒపికి తీసుకువచ్చారు. అతనిని టీం ఆఫ్ డాక్టర్స్, కంటి నిపుణులు, న్యూరో సర్జరీ డాక్టర్స్, ఆర్థోపెడిక్ డాక్టర్లు, ఇఎన్‌టి డాక్టర్, మత్తు డాక్టర్లు పరీక్షించి ఆపరేషన్ చేసి కంటిలో దూసుకుపోయిన కర్రను తీసివేయాలని తెలిపారు. సిటి స్కానింగ్, రక్త పరీక్ష, ఎక్సరే మొదలగు అన్ని పరీక్షలు చేసి పేషెంట్ అనుమతితో ఆరో తేదీ ఉదయం 11 గంటలకు ఆపరేషన్ నిమిత్తం న్యూరో సర్జరీ విభాగానికి షిఫ్ట్ చేశారు. టీం ఆఫ్ డాక్టర్స్ సరుగుడు కర్ర ముక్కను బయటకు తీయడంతో ఆపరేషన్ విజయవంతమైంది.

విధేయతకు ప్రాధాన్యత

అనితకు కీలకమైన హోంశాఖ
పార్టీ కార్యకర్తల్లో ఆనందం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

టిడిపి అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌కు విధేయురాలుగా ఉన్న పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనితకు మంత్రివర్గంలో సముచిత స్థానమే లభించింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి ఎన్నికైన అయ్యన్నపాత్రుడు వంటి సీనియర్లను కాదని, తమకు విశ్వాసపాత్రురాలిగా వున్న అనితకు తాజాగా హోంశాఖ, విపత్తుల నిర్వహణ వంటి కీలకమైన బాధ్యత చంద్రబాబు అప్పగించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు దక్కుతుందనుకున్న ఈ పదవి కూటమి ప్రభుత్వంలో అనిత పరమైంది. పాయకరావుపేట నుంచి 2014, 2024 ఎన్నికల్లో ఆమె విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో కొవ్వూరు నుంచి పోటీచేసి ఓటమిచెందారు. ఉమ్మడి జిల్లాలో ఇంతవరకు ఎవరికీ రాని హోం మంత్రి పదవి కూటమి ప్రభుత్వంలో అనిత సంపాదించుకున్నారు. మంత్రివర్గంలో కీలకమైన హోం శాఖ పదవి రావడంపై పాయకరావుపేట నియోజకవర్గ టిడిపి కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలుగు మహిళా అధ్యక్షురాలుగా, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలుగా ఆమె గత ప్రభుత్వ తీరును తీవ్రంగా ఎండగట్టారు. ఏ మాత్రం వెరవకుండా గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై ఘాటైన విమర్శలు చేశారు. ఒక్కోసారి అయ్యన్నపాత్రుడు కంటే మించి ఆరోపణలు చేసి చంద్రబాబు వద్ద విధేయత కలిగిన కార్యకర్తగా గుర్తింపు పొందారు. ఆ గుర్తింపుతో కూటమి ప్రభుత్వంలో ఎస్‌సి మహిళా కోటాలో హోంశాఖ మంత్రి పదవి అనిత పొందగలిగారు. టిడిపికి వ్యతిరేకంగా పనిచేసిన వ్యక్తుల పేర్లను రెడ్‌బుక్‌లో రాసినవారెవరినీ అధికారంలోకి వచ్చాక వదిలిపెట్టబోమని అనేకసార్లు లోకేష్ బహిరంగ సభల్లో మాట్లాడారు. ఆ రెడ్‌బుక్ తెరవడానికి అత్యంత విధేయత కలిగిన వ్యక్తి చంద్రబాబుకు అవసరం. రెడ్‌బుక్ కార్యం నెరవేరాలంటే ప్రస్తుతం తమ మాట ఏ మాత్రమూ జవదాటని అనితకు హోంశాఖ ఇవ్వడం సరైనదని చంద్రబాబు వ్యూహాత్మకంగా ఆలోచించి ఆ బాధ్యతలు అప్పగించారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఎయు విసి అక్రమాలపై నిరసన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రా యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ పివిజిడి.ప్రసాదరెడ్డి అవినీతి అక్రమాలపై విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, ఉద్యోగ, పరిశోధక, అధ్యాపక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. విసి ప్రసాదరెడ్డిని వెంటనే తొలగించాలని, ఆయన చేపట్టిన చట్ట వ్యతిరేక నిర్ణయాల మీద విచారణ కమిటీని నియమించాలని, జేమ్స్ స్టీఫెన్‌ను రిజిస్ట్రార్ పదవి నుంచి, అంబేద్కర్ ఛైర్ ప్రొఫెసర్ ఉద్యోగం నుంచి తొలగించాలని నినదించారు. యూనివర్శిటీలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ డాక్టోరల్ ఫోరమ్ ప్రెసిడెంట్ సురేష్ మీనన్, ఎయు ప్రోగ్రెసివ్ ఫోరమ్ కన్వీనర్ డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్, ఎయు కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అర్జున్, యూనివర్సిటీ నిరుద్యోగ జెఎసి కన్వీనర్ అప్పారావు, ఉద్యోగుల సంఘం నాయకులు బలరాం, గెస్టు ఫ్యాకల్టీ అసోసియేషన్ భాను తదితరులు పాల్గొన్నారు .

నిరసన తెలుపుతున్న పలు సంఘాల నాయకులు

స్కూల్ బస్సులపై కొరడా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేని, నిబంధనలు పాటించని స్కూలు, కాలేజీ బస్సులపై రవాణా శాఖ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. అందులో భాగంగా శుక్రవారం మద్దిలపాలెం, బోయపాలెం, గాజువాక ప్రాంతాలలో రవాణా శాఖ అధికారులు దాడులు చేసి నిబంధనలు ఉల్లంఘించిన బస్సులపై కేసులు నమోదు చేసినట్టు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రాజారత్నం మీడియాకు తెలిపారు. గురు, శుక్రవారాల్లో స్కూలు, కాలేజీ బస్సులపై ప్రత్యేక తనిఖీలను చేపట్టామన్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేకపోవడం, నిబంధనలు ఉల్లంఘించడం వంటి అక్రమాలకు పాల్పడుతున్న బస్సులను గుర్తించి, వాటి యజమానులపై కేసులు నమోదు చేయడం లేదా సీజ్ చేయడం చేస్తున్నామన్నారు. గురువారం మూడు బస్సులపైనా, శుక్రవారం ఏడు బస్సులపైనా కేసులు నమోదు చేశామని, ఒక బస్సును సీజ్ చేశామని వెల్లడించారు. ఈ దాడులను కొనసాగిస్తామని చెప్పారు. బస్సుల ప్రత్యేక తనిఖీల కార్యక్రమంలో రవాణా శాఖ తనిఖీ అధికారులు మన్మోహన్, సుధీర్, సుమన్ కుమార్, లలిత, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

19 నుంచి జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జర్నలిస్టులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం తరపున ప్రత్యేక చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఈ నెల 19 నుంచి అపోలో ఆసుపత్రిలో జర్నలిస్టుతో పాటు వారి జీవిత భాగస్వామికి కూడా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నామని శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24లో అక్రిడిటేషన్ కలిగిన జిల్లాలోని జర్నలిస్టులందరి వివరాలు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా అపోలో ఆసుపత్రి యాజమాన్యానికి పంపించామని చెప్పారు. సంబంధిత జాబితాను సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచామని వెల్లడించారు. అక్రిడిటేషన్ కలిగి ఉన్న జర్నలిస్టులు ఆరిలోవలోని అపోలో ఆసుపత్రిలో 19వ తేదీ ఉదయం 8 నుంచి 9.30 గంటల మధ్యలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. పరీక్షల అనంతరం రిపోర్టులు వచ్చాక వైద్యుడిని సంప్రదించి చెకప్ కూడా చేయించుకునేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. వైద్య పరీక్షలు రోజుకు 50 మంది చొప్పున సోమవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహిస్తారని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని జర్నలిస్టులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య పరీక్షల నిమిత్తం అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులు ముందుగా వారితో పాటు వారి జీవిత భాగస్వామి ప్రాథమిక వివరాలను సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఈ నెల 17 నుంచి తెలియజేయాలని కోరారు. ఇతర వివరాలకు 8008656504 నెంబరును సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

16న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శ్రీ కనక మహాలక్ష్మి కో - ఆపరేటివ్ బ్యాంక్ రజతోత్సవంలో భాగంగా ఆదివారం అక్కయ్యపాలెంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు బ్యాంకు ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. బ్యాంకు ఖాతాదారులు, శ్రేయోభిలాషులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

డిఆర్‌ఎం కప్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలోని శ్రీ శ్రీనివాస కళ్యాణ మండపంలో ఈ నెల 22, 23 తేదీలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి డిఆర్‌ఎం కప్ చెస్ ఛాంపియన్‌షిప్ పోస్టర్‌ను డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ శుక్రవారం తన ఛాంబర్‌లో విడుదల చేశారు. ఈ ఛాంపియన్‌షిప్‌ను ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ (వాల్తేరు) నిర్వహిస్తోంది. ముఖ్య అతిథిగా డిఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ హాజరుకానున్నారు. కార్యక్రమంలో ఎడిఆర్‌ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, స్పోర్ట్స్ ఆఫీసర్ ప్రవీణ్ భాటి, జాయింట్ స్పోర్ట్స్ ఆఫీసర్ బి.అవినాష్ ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

చెన్నయ్ సెంట్రల్ - సంత్రాగచ్చి మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని క్లియర్ చేయడానికి రైల్వే శాఖ ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ - సంత్రాగచ్చి ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 06007 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి స్పెషల్ జూన్ 14 రాత్రి 21.00 గంటలకు ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ నుండి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 13.54 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 13.59 గంటలకు బయలుదేరి ఆదివారం 07.15 గంటలకు గమ్యస్థానమైన సంత్రాగచ్చి చేరుకుంటుంది. 06008 సంత్రాగచ్చి- ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ స్పెషల్ జూన్ 16న ఉదయం 10.00 గంటలకు సంత్రాగచ్చి నుండి బయలుదేరి మరుసటి రోజు అర్ధరాత్రి 01.48 గంటలకు దువ్వాడ చేరుకుని మరల 01.50 గంటలకు బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 15:50 గంటలకు ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ చేరుకుంటుంది. ఈ రైలు ఖరగ్‌పూర్, బాలాసోర్, భద్రక్, కటక్, భువనేశ్వర్, ఖుర్దా రోడ్, పలాస, శ్రీకాకుళం రోడ్, విజయనగరం, దువ్వాడ, సామర్లకోట్, రాజమండ్రి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు మీదుగా ప్రయాణిస్తాయి.

ఉల్లి, టమోటా ధరలకు రెక్కలు!

- అమాంతం పెరిగిన కూరగాయలు, నిత్యావసరాల ధరలు
- సామాన్యుల జీవనంపై విపరీత భారం

మార్కెట్‌లో కూరగాయలను కొంటున్న ప్రజలు

ప్రజాశక్తి -తగరపువలస: స్థానిక ప్రైవేట్ మార్కెట్‌లో టమోటా, ఉల్లితో పాటు పచ్చి మిర్చి, బెండ, బీర తదితర కూర గాయల ధరలకు అమాంతం రెక్కలు వచ్చాయి. వారం రోజుల క్రితం కిలో టమోటా రూ.50 ఉండగా ఇప్పుడు ఏకంగా రూ 80లకు చేరింది. ఉల్లి కిలో ధర రూ.30 నుంచి రూ.50కి చేరింది. పచ్చి మిర్చి కిలో రూ .60 ల నుంచి ఏకంగా రూ.వందకు చేరింది.
ఇక బీర కాయలు కిలో రూ 60 నుంచి రూ 80 లు, దొండకాయలు కిలో రూ రూ 40 నుంచి రూ 60 లు, క్యారెట్ కిలో రూ 30 నుంచి రూ 40 లకు పెరిగాయి. దీంతో వినియోగదారులు ఉల్లి, టమోటా, బీర, దొండ, క్యారట్ కొనాలంటే వెనకడుగు వేస్తున్నారు. గతంలో కిలో ఉల్లి కొంటే, ఇప్పుడు దాన్ని సగానికి తగ్గించేశారు. కూరలు, రసం, సాంబారులో దాదాపు ఉల్లి వాసన లేదంటే అతిశయోక్తి కాదు. ఓ వైపు బియ్యం, పప్పు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకు పైపైకి ఎగబాకుతుంటే, ఇపుడు కూరగాయలు కూడా అదే బాట పట్టడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు ఉల్లి, టమోటా తదితరాల వినియోగం ఎక్కువవ్వడం, సరిపడా పంట ఉత్పత్తి లేకపోవడమే ప్రస్తుతం ధరలు అమాంతంగా పెరుగుదలకు కారణమని భావిస్తున్నారు. మప రాష్ట్ర, నాసిక్ నుంచి ఉల్లిలారీల ద్వారా నగరంలోని జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌కు దిగుమతి అవుతుండగా, అక్కడ నుంచి తాము తెచ్చుకుంటున్నట్లు స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. 25 కిలోల ఉల్లి బాక్స్ రూ 1800 నుంచి రూ 1900 లకు కొనే పరిస్థితి ఉందని, వీటిల్లో రద్దు పోనూ, మిగిలిన వాటితో సొమ్ముచేసుకోవడం కష్టమౌతోందనిఇక్కడ కొంతమంది వ్యాపారులు అంటున్నారు. ఇక టమోటా బెంగుళూర్ నుంచిజ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌కు లారీల ద్వారా స్టాక్ వస్తుంది. ఇక్కడ వ్యాపారులు జ్ఞానాపురం నుంచి టమోటా కొని అమ్ముతుంటారు.

భీమిలి,ఆనందపురం, పద్మనాభం మండలాల్లో టమోటా సాగు ఉన్నప్పటికీ, ఇక్కడి ప్రజల అవసరాలకు సరిపడా పండడం లేదనే చెప్పాలి. ఆయా మండలాల్లోని కూరగాయల రైతులు టమోటాను ఆటోల ద్వారా ఇక్కడి మార్కెట్‌కు తెచ్చి అమ్ముతుంటారు. అయితే సరిపడా టమోటా లభ్యం కానందున జ్ఞానాపురం వెళ్లి టమోటా కొని తెస్తుంటామని వ్యాపారులు అంటున్నారుజ కొంతమంది బడా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించడం కూడా ధరల పెరుగుదలకు ఓ కారణంగా పలువురు అభిప్రాయపడుతున్నారు.

ధరలను నియంత్రించాలి

నిత్యవసరాలు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోవడం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలుగా మేము ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వాలు స్పందించి, ధరలను అదుపు చేయాలి

– కె మాధవి, గృహిణి

వాడకం తగ్గించుకున్నాం

టమోటా, ఉల్లి ధరలు పెరగడం వల్ల వాడుక తగ్గించుకున్నాం. వీటితోపాటు ఇతర నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగాయి. ధరాభారం కుటుంబపోషణకు ఇబ్బందికరంగా ఉంది.

-ఎ గంగాభవాని, గృహిణి

పలుచోట్ల రక్తదాన శిబిరాలు

అనిల్ నీరుకొండ ఆసుపత్రిలో రక్తదానం చేస్తున్న దాతలు

ప్రజాశక్తి -తగరపువలస: ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రి రక్తనిధి కేంద్రంలో శుక్ర వారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 51 మంది దాతలు రక్తదానం చేశారు. అనిల్ నీరుకొండ విద్యాసంస్థల సిఇఒ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్నారై మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ పివి సుధాకర్, అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమాదేవి, పేథాలజీ విభాగాధిపతి డాక్టర్ భాగ్యలక్ష్మి, రక్తనిధి కేంద్రం ప్రొఫెసర్ మల్లాది శర్మ పాల్గొన్నారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు

అనకాపల్లి : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా స్థానిక విజయ రెసిడెన్సీలో శుక్రవారం సర్వేజనా ఐక్యవేదిక వ్యవస్థాపక చైర్మన్ కోరుబిల్లి పరమేష్ (పరి) ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 53 మందికి పైగా రక్తదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విజయ రెసిడెన్సీ విజయ లక్ష్మి చేతుల మీదుగా రక్త దాతలుకు కండువా వేసి జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంకుల మధు, రాజు, లాలం కన్నాజి, కర్రి మహాలక్ష్మి నాయుడు, గొర్లి శేఖర్, రేబాక మధు, ఆడారి శ్రీను, వాకాడ సతీష్, ఆళ్ళ ప్రవీణ్ కుమార్, విల్లూరి సంతోష్, పొలిమేర ఓంకార్, బుద్ధ జగన్, కనకలా అరవింద్, అధిక సంఖ్యలో రక్తదాతలు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుపై హర్షం

ప్రజాశక్తి -భీమునిపట్నం : భూయజమానులకు శరాఘాతంలాంటి ల్యాండ్ టై ట్లింగ్ చట్టాన్ని రద్దు చేస్తూ సిఎం చంద్రబాబు నేతృతంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షనీయమని ట్లు స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంవి పార్వతీశం, కార్యదర్శి కెఎస్ఎం సుధాకర్ శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. భూయాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని న్యాయవాదులు గతంలో వివిధ రూపాల్లో నిరసన తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు.

బిసిజి వ్యాక్సినేషన్‌పై అవగాహన

ప్రజాశక్తి- పద్మనాభం : క్షయవ్యాధి నివారణకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న బిసిజి వ్యాక్సినేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని సంబంధిత వైద్యసిబ్బంది కోరారు. శుక్రవారం మండలంలోని కృష్ణాపురం, పొట్నూరులలో రేవిడి పిహెచ్‌సి వైద్యసిబ్బంది, భీమిలి టిబి యూనిట్ వైద్యబృందం ఆధ్వర్యంలో టిబి నివారణకు బిసిజి వ్యాక్సినేషన్ వేసుకోవాలంటూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 60ఏళ్ల పైబడిన వారు, ఐదేళ్లలోపున్నవారు, 18ఏళ్లు నిండి, మధుమేహం, పొగాకు అలవాటున్నవారు, క్షయవ్యాధి రోగుల కుటుంబసభ్యులు ఉచిత వ్యాక్సినేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్షయవ్యాధి రహిత భారత్‌ను చేయాలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం బిసిజి వ్యాక్సిన్‌ను ఉచితంగా అందిస్తోందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులుఎం అప్పలనాయుడు. సుంకర అచ్చునాయుడు, బొడ్డు శ్రీను పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణం పూర్తికి చర్యలు

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని రెల్లిపేటలో రామాలయం నిర్మాణం పూర్తి చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర ప్రముఖ్ రాధాకృష్ణ కోరారు. శుక్రవారం రెల్లిపేటలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ టిటిడి సహకారంతో సమరసతా సేవా ఫౌండేషన్ అధ్వర్యంలో రాష్ట్రంలో 822 ఆలయాలకు నిధులు మంజూరు చేయగా, 821 ఆలయాల నిర్మాణం పూర్తయిందని, ఒక్క రెల్లిపేటలోనే అసంపూర్తిగా ఉందన్నారు. ఆలయాన్ని పూర్తిచేయడానికి మాజీ ఎంపిపి గోపిబాబు, ఇతర పెద్దలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గంగాధర్, నరేంద్ర, మాజీ ఎంపిపి డి. గోపీబాబు, గౌరినాయుడు, టిడిపి మండల మాజీ అధ్యక్షుడు పివి.రమణ, మాజీ ఉప సర్పంచ్ చంద్రరావు, నర్సింగరావు పాల్గొన్నారు.

మనోధైర్యంతో కేన్సర్‌ను జయించొచ్చు!

కేన్సర్ విజేతలతో క్రైం డిసిపి వెంకటరత్నం, అపోలో వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : కేన్సర్‌తోపాటు ఎంతటి మహమ్మారి వ్యాధులనైనా ప్రాథమిక దశలోనే గుర్తించి, తగు చికిత్స పొందడంతోపాటు మనోధైర్యం ఉంటే ఎంతటి ప్రాణాంతక వ్యాధినైనా జయించవచ్చని అపోలో కేన్సర్ విభాగం వైద్యులు, కేన్సర్ వ్యాధిని జయించిన విజేతలు అన్నారు. శుక్రవారం ఆరిలోవ, హెల్త్‌సిటీలో ప్రపంచ కేన్సర్ విజేతల దినోత్సవాన్ని అపోలో కేన్సర్ విభాగంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఇటీవల కేన్సర్ వ్యాధికి చికిత్స తీసుకొని, వ్యాధిని జయించిన విజేతలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. విశిష్ట అతిథిగా నగర నేరవిభాగం డిసిపి వెంకటరత్నం పాల్గొని కేన్సర్ వ్యాధికి వ్యతిరేకంగా పోరాడిన తీరు, స్ఫూర్తి, సంకల్పాన్ని తెలుసుకుని, వారిని అభినందించారు. ఈ సందర్భంగా సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్టులు డాక్టర్ రాకేష్‌రెడ్డి, డాక్టర్ సుమన్ దాస్ మాట్లాడుతూ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి, రోగి మొండిధైర్యం, కుటుంబ సభ్యుల సహకారం ఉంటే కేన్సర్ వంటి భయంకర వ్యాధినైనా జయించవచ్చన్నారు. సర్జికల్ ఆంకాలజిస్టులు డాక్టర్ చంద్రకల్యాణ్, రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఆదిత్యనారాయణ్ మాట్లాడుతూ దృఢమైన ఆశయం ప్రాముఖ్యతను వివరించారు.. కేన్సర్‌ను జయించిన జయశ్రీ హతంగడి, రాధ, రమాబాయి, శైలజ, నికిత నాయుడు తదితరులు మాట్లాడుతూ కేన్సన్‌ను ఓడించే ప్రయాణంలో ఆరోగ్య సంరక్షణ ప్రదాతలతో పాటు కుటుంబ సభ్యుల మద్దతు, ఆసుపత్రిలో వైద్యుల అందించిన చికిత్స, మనోధైర్యాన్ని తలచుకుంటూ ఈ వ్యాధిని జయించినట్టు తెలిపారు. అపోలో ఆసుపత్రి సిఇఒ శ్రీరామచంద్ర మాట్లాడుతూ కేన్సర్ సంరక్షణను మెరుగుపరచడంలో అపోలో నిబద్ధతను వివరించారు.. కేన్సర్‌కు వ్యతిరేకంగా పోరాడి జయించిన విజేతలు, వారి కుటుంబసభ్యులకు తగ్గింపుతో కూడిన కేన్సర్ ప్యాకేజీని ప్రకటించారు. అనంతరం రోహిత్ మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు కేన్సర్ లఘ్నునాటికను ప్రదర్శించి కేన్సర్ విజేతలను, కుటుంబ సభ్యులను ఆనందింపచేసారు. కార్యక్రమంలో మెడికల్ సూపరెంటెండెంట్ డాక్టర్ బాలక్రిష్ణ, కార్పొరేట్ రిలేషన్స్ డిజిఎం విజయసారధి, ఆంకో హెచ్ఒడి సత్య, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ జయశ్రీ పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సితో నిరుద్యోగులకు మేలు

ప్ర **ప్రజాశక్తి-సీతమ్మధార :** మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరూపించారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి కొనియాడారు. శుక్రవారం పౌర గ్రంథాలయంలో మీడియాతో మాట్లాడుతూ సిఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నిరుద్యోగులకు మేలు చేసే మెగా డిఎస్‌సిపై మొదటి సంతకం చేయడం, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, సామాజిక పింఛన్ల సాయం పెంపు, అన్నాక్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణనపై తర్వాత వరుస సంతకాలు చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకునే దిశగా సాగడం అభినందనీయమన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో పాలనను మొదలెట్టిన జగన్‌కు, మెగా డిఎస్‌సి, అన్నాక్యాంటీన్ల ఏర్పాటుతో పాలనకు శ్రీకారం చుట్టిన చంద్రబాబుకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రిగా పవన్‌కల్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వపాలనలో ఎపి పురోభివృద్ధి సాధిస్తుందని భరోసానిచ్చారు. ఇదే సమయంలో ఉత్తరాంధ్రలో అసైన్డ్ భూములను కాజేసిన మాజీ సిఎస్ జవరహార్‌రెడ్డిపై చంద్రబాబు దృష్టిసారిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర భూఅక్రమాలపై విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

మద్దిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఎంపిపి రాంబాబు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది పంచాయతీ పరిధిలోని బుగత వారి కల్లాల వద్ద రూ.ఐదు లక్షలతో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎంపిపి కె.రాంబాబు శుక్రవారం ప్రారంభించారు. లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజల విజ్ఞప్తి మేరకు దీన్ని ఏర్పాటు చేయడంపై వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, ఎర్రినాయుడు, నారాయణరావు, శ్రీను పాల్గొన్నారు.

మహిళకు ఆర్థిక సాయం

బాధితురాలు ఎర్రమ్మకు నగదు అందిస్తున్న శంకర రెడ్డి

ప్రజాశక్తి- తగరపువలస : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై, అనారోగ్యంతో బాధపడుతున్న భీమిలి మండలం, చిన నాగమయ్యపాలెం గ్రామానికి చెందిన ఎర్రమ్మకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సతీమణి శారద శుక్ర వారం రూ 10వేలు సాయం చేశారు. బాధితురాలికి నగదు సాయాన్ని జనసేన జివిఎంసి రెండో వార్డు అధ్యక్షులు నీలాపు శంకరరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో రాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు

అన్నీ అరకొరే..!

- అవసరం కంటే తక్కువగా పాఠ్యపుస్తకాలు
- ఇంకా చేరని యూనిఫాంలు, డిక్షనరీలు
- విద్యార్థులకు సరిపడా లేని స్టూడెంట్ కిట్స్
- పాఠశాలలకు పంపిణీకి చకచకా ఏర్పాట్లు

స్టాక్ పాయింట్‌లో పుస్తకాలను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు కల్పన

ప్రజాశక్తి -భీమునిపట్నం : కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమైంది. పాఠశాలలూ తెరుచుకున్నాయి. అయితే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, ఇతర స్టూడెంట్స్ కిట్స్ పంపిణీపై విద్యాశాఖ అధికారులు చకచకా చర్యలు చేపడుతున్నారు. మండలంలోని స్టాక్‌పాయింట్ల వరకు స్టూడెంట్ కిట్స్ చేరుకున్నా, ఇంకా పాఠశాలలకు, అక్కడి నుంచి విద్యార్థులకు పూర్తిస్థాయిలో చేరుకోలేదు. మండలంలో అవసరమైన వాటికన్నా, అన్నీ తక్కువగా రావడంతో ఎలా పంపిణీ చేయాలనే దానిపై అధికారులు మల్లగుల్లాలు పడుతూ, లెక్కలేసుకుంటూ పంపిణీ చేపడుతున్నారు. భీమిలి మండలం, జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో 67 ప్రాథమిక, 11 ప్రాథమికోన్నత, 22 ఉన్నత పాఠశాలలతో కలుపుకుని 100 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచి 10 వ తరగతి వరకు 5034 మంది బాలికలు, 3783 బాలురు చదువుతున్నారు వీరికి పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, బ్యాగ్‌లు, బెల్టులు తదితరాలతో కూడిన స్టూడెంట్ కిట్లు పంపిణీకి చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి మండలంలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 81,377 పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్ అవసరం కాగా, తొలివిడతలో 67,877 మాత్రమే రాగా, వాటిని పాఠశాలల ద్వారా విద్యార్థులకు పంపిణీకి మండల విద్యా శాఖ అధికారులు

స్టాక్ పాయింట్ నుంచి పుస్తకాలను తీసుకెళుతున్న ఉపాధ్యాయులు

ఏర్పాట్లు చేశారు. 8,817 స్కూల్ బ్యాగ్‌లకు గాను 8,614 వచ్చాయి. దాదాపు 200 బ్యాగ్‌లు తక్కువగా ఉన్నాయి. ఇక షూస్ 8,823 అవసరం కాగా, కేవలం 3,782 స్టాక్ పాయింట్‌కు చేరాయి. ఇక 5,341 బెల్టులు, 62,872 నోట్ పుస్తకాలు, 511 పిక్టోరియల్ నిఘంటువులు మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్‌కు ఇప్పటికే చేరుకున్నాయి. విద్యార్థులకు సంఖ్యకు తగ్గట్టుగా ఇవి రాకపోవడంతో పంపిణీపై అధికారులు కసరత్తు చేస్తూ ఆచితూచి అందజేస్తున్నారు.

సరఫరా కాని యూనిఫాంలు, ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులు..

ఇక మండలంలోని ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీకి 8,817 యూనిఫాంలు, 1007 ఆక్స్ ఫర్డ్ నిఘంటువులు అవసరం కాగా, అవి ఇంకనూ మండల కేంద్రానికి చేరలేదు.

మెగా డిఎస్‌సి ప్రకటనపై హర్షం

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నిరుద్యోగులు

సీతమ్మధార : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డిఎస్‌సి ప్రకటనపై మొదటి సంతకం చేసి ఇచ్చిన మాటను సిఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారనిఏపి నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మద్రివేముల శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పౌరగ్రంథాలయం వద్ద చంద్రబాబు చిత్రపటానికి గాజుగ్లాస్‌తో పాలభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం స్వాగతించదగ్గ పరిణామమన్నారు. వారాహియాత్రలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చెప్పినట్టే హామీల అమలుకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. కాగా వైసిపి ప్రభుత్వం 2019లో మెగాడిఎస్‌సి హామీనిచ్చి, నిరుద్యోగులకు నయవంచనకు గురిచేసిన జగన్‌కు ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో గుణపాఠం చెప్పారన్నారు. నిరుద్యోగులతో పెట్టుకుంటే ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రదీప్, జనసేన మహిళా విభాగం నేత కొల్లూరి రూప, నిరుద్యోగ పోరాట కమిటీ నాయకులు సేనాపతి సన్యాసినాయుడు, సత్యనారాయణ, వియ్యపు ఎర్రాజీ, మణికంఠ యువత పాల్గొన్నారు.

అనధికార కార్యకలాపాల నిర్మూలనకు చర్యలు

మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్యాకర్స్ అండ్ మూవర్స్ ముసుగులో జరుగుతున్న అనధికారిక కార్యకలాపాల నిర్మూలనకు ది వైజాగ్ ప్యాకర్స్ అండ్ మూవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పనిచేస్తోందని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ సురేంద్రరావు, కె.నూకేష్ తెలిపారు. శుక్రవారం అక్కయ్యపాలెంలోని అసోసియేషన్ సిటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ, 2022లో ఆవిర్భవించిన అసోసియేషన్‌లో ఇటీవల అనధికారిక కార్యకలాపాలు జరగడం శోచనీయమని, దీనిపై నోటీసులు జారీ చేశామన్నారు. ప్రస్తుతం ఎలాంటి అనుభవం లేనికొంతమంది ప్యాకర్స్ అండ్ మూవర్స్ పనులు చేస్తుండడం వల్ల ప్రజలకు కొంతమేర ఇబ్బంది కలుగుతోందని, వీటి కట్టడికి చర్యలు చేపడుతున్నామన్నారు. అసోసియేషన్‌లో సభ్యత్వం కోసం ఆసక్తి ఉన్నవారు 9949124137 మొబైల్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు బొడ్డేటి సత్తిబాబు, కోరుబిల్లి ఈశ్వరరావు, కోశాధికారులు సిహెచ్ శ్రీకాంత్, ప్రమోద్‌రెడ్డి, సతీష్, అదనపు కార్యదర్శులు రవీంద్ర నాయర్, ఇల్లా రమేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ ప్రారంభించాలి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం జంక్షన్‌లో అన్నాక్యాంటీన్‌ను ఏర్పాటు చేసి, పేదల ఆకలి తీర్చేందుకు చర్యలు చేపట్టాలని లారీ యూనియన్ అసోసియేషన్ కార్యదర్శి పూడి అప్పారావు, సభ్యులు కిలాని శ్రీనివాస్ కోరారు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో రూ. 5కే భోజనం, అల్పాహారం అందించి, ఎందరో పేదల ఆకలిని తీర్చారన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నాక్యాంటీన్లను ఎత్తేయడంతో ఎంతోమంది పేదలు ఇబ్బందులు పడ్డారన్నారు. అన్నా క్యాంటీన్లను పునరుద్ధరిస్తామని ముఖ్యమంత్రిగా చంద్రబాబు సంతకం చేయడం హర్షణీయమన్నారు. ఈ నేపథ్యంలో దాదాపు 60వేలు జనాభాతోపాటు ఎంతోమంది చిరువ్యాపారులు, కార్మికులకు నెలవైన ఆనందపురం జంక్షన్‌లో అన్నాక్యాంటీన్‌ను ఏర్పాటు చేసి పేదల ఆకలి తీర్చాలని కోరారు

ఉక్కు పరిరక్షణకు కృషి చేయాలి

దీక్షల్లో పాల్గొన్న ఉక్కు కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద ఉక్కు పరిరక్షణ పోరాటసమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు శుక్రవారం 1219వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఉక్కు ట్రాఫిక్, ఆర్ఎండి, కన్‌స్ట్రక్షన్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నేతలు వరసాల శ్రీనివాసరావు, డి ఆదినారాయణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు, మొదటి క్యాబినెట్ సమావేశంలో విశాఖ ఉక్కు పరిరక్షణపై తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకునేలా ప్రధాని మోడీతో మాట్లాడాలని కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ముడిసరుకు కొనుగోలుకు వీలులేకుండా కేంద్రం విధించిన ఆంక్షలు సడలించేందుకు చర్యలు చేపట్టాలని, పూర్తిస్థాయి సామర్థ్యం ఉన్నా, అరకొర ఉత్పత్తితో దాదాపు రూ.నాలుగు వేలకోట్ల నష్టాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థలా మునుపటిలా కొనసాగించడమో, లేకుంటే సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు.స్టీల్‌ప్లాంట్ నిలదొక్కుకునేందుకు అవసరమైన ఆర్థిక ప్రయోజనాలను కల్పించడంతోపాటు, ప్లాంట్ భూములను ప్లాంట్‌కే బదలాయించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు.బ్యాంకర్లు రుణాలు ఇవ్వకుండా ఆంక్షలు విధించడం దుర్మార్గమని, కార్పొరేట్లకు రూ.12లక్షల కోట్ల రుణమాఫీ చేసిన కేంద్రం, విశాఖ స్టీల్‌ప్లాంట్ పట్ల అనైతికంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. మెగా డిఎస్‌సి ప్రకటన మాదిరిగానే, విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోఖాళీగా ఉన్న ఏడువేల పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో దాసరి శ్రీనివాసరావు, లక్ష్మణరావు, హరినాథ్, పివి. రమణ, ఎస్ శ్రీనివాసరావు, కె. సంతోష్‌కుమార్, దాసుబాబు, దానయ్య, నాయుడు, విజయానందరావు, శేఖర్, సువర్ణ రాజు, జి ప్రకాష్, వెంకటమ్మ పాల్గొన్నారు

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 52వ వార్డు కరాస ప్రాథమిక పాఠశాల, విశ్వోదయ పాఠశాల పూర్వ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శుక్రవారం పంపిణీ చేశారు. కరాస పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీని ప్రారంభించిన డిప్యూటీ మేయర్ శ్రీధర్ మాట్లాడుతూ, పేద విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పుస్తకాలను బాగా చదువుకుని, తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భారతి, మల్లిక్‌షా పాల్గొన్నారు.

పల్లాకు టిడిపి రాష్ట్ర అధ్యక్ష పదవిపై హర్షం

- నగరంలో పలుచోట్ల సంబరాలు

ప్రజాశక్తి -గాజువాక : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నియామకంపై పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ మేరకు అధినేత చంద్రబాబు ప్రకటించిన వెంటనే, శుక్రవారం పాతగాజువాక జంక్షన్లో బాణాసంచాకాల్చి, స్వీట్లు పంచి సందడి చేశారు. 1968లో గాజువాకలో రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబంలో పల్లా శ్రీనివాసరావు జన్మించారు. ఆంధ్రా యూనివర్సిటీలో ఎంటెక్, ఎంబిఎలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడైన శ్రీనివాసరావు తండ్రి పల్లా సింహాచలం విశాఖ-2 నియోజకవర్గంలో, ఎన్టీ రామారావు హయాంలో ఎమ్మెల్యేగా గెలుపొందారు. పల్లా శ్రీనివాసరావు, ఎంటెక్‌లో సివిల్ విభాగం కావడంతో, విశాఖ నగరంలో చాలా ప్రాజెక్టులకు ఉచితంగానే కన్సల్టేషన్ ఇచ్చేవారు. 2009లో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ తరపున విశాఖ ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్‌లో విలీనం కావడంతో శ్రీనివాసరావు కూడాకాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014లో గాజువాక కాంగ్రెస్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బిఫారం ఇచ్చినప్పటికీ, టిడిపి టిక్కెట్‌కు ప్రయత్నించి,

విశాఖ తూర్పు కార్యాలయంలో సంబరాల్లో ఎమ్మెల్యే వెలగపూడి

సాధించి, గెలుపొందారు. అయితే 2019లో గాజువాకలో జనసేనాని పవన్‌కల్యాణ్ పోటీలో ఉండడంతో టిడిపి అభ్యర్థిగా పోటీచేసి, వైసిపి చేతిలో ఓటమి పాలయ్యారు.. తర్వాత విశాఖ జిల్లా టిడిపి అధ్యక్షుడుగా చంద్రబాబు నియమిస్తే, రాష్ట్రంలో టిడిపి ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జిల్లాలో ఎలాంటి గ్రూపులకు ఆస్కారం లేకుండా అందరినీ సమన్వయం చేస్తూ పార్టీని సమర్థవంతంగా నడిపించారు. తాజాగా 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో టిడిపి ఎమ్మెల్యేగా పల్లా గెలుపొందారు. అందరూ మంత్రి పదవి వస్తుందని ఆశించినప్పటికీ, రాజకీయ, కుల, ప్రాంతీయ సమీకరణల నేపథ్యంలో అది నెరవేరనప్పటికీ, అధినేత చంద్రబాబుకు పల్లాపై ఉన్న నమ్మకం, భరోసాతో టిడిపి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను అప్పగించారు. పల్లాకు తెలుగుదేశం రాష్ట్రపగ్గాలు దక్కడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నప్పటికీ, మంత్రి పదవి వస్తే చాలా బాగుండేదని కొందరు కార్యకర్తలు, నాయకులు అభిప్రాయ పడుతున్నారు.

తూర్పులో టిడిపి శ్రేణుల సంబరాలు

ఎంవిపి కాలనీ: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా గాజువాక ఎమ్మెల్యే, విద్యావేత్త పల్లా శ్రీనివాసరావు నియామకంపై తూర్పు టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వెలగపూడి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన పల్లా శ్రీనివాస్‌ను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తూ, అధినేత చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జోన్ వన్ టిడిపి మీడియా కోఆర్డినేటర్ బైరెడ్డి పోతనరెడ్డి నాయకులు కాళ్ల శంకరు గొలగాని గోపాలరావు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

విశ్వ మానవుడు చే గువేరా

నన్నయ యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య ముర్రు

చే గువేరా చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఆచార్య ముర్రు

ప్రజాశక్తి-చోడవరం

లాటిన్ అమెరికా విప్లవ యోధుడు చే గువేరా విశ్వ మానవుడని ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు అన్నారు. స్థానిక ప్రేమ సమాజంలో శుక్రవారం నిర్వహించిన చే గువేరా జయంతిలో ఆయన మాట్లాడుతూ చే గువేరా గొప్ప మానవతావాది అని, అతను క్యూబా వ్యవసాయ మంత్రిగా ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. ఎప్పటికీ ఈ ప్రపంచంలో యువతకి అతనొక ప్రవహించే ఉత్తేజం, స్ఫూర్తి అని పేర్కొన్నారు. క్యూబాను నియంత పాలన నుండి విముక్తి కల్గించి, దాని పునర్నిర్మాణంలో ప్రధాన భూమికను పోషించిన చే తరువాత బొలీవియా విముక్తి కోసం పోరాడుతూ వీరమరణం పొందారని గుర్తు చేశారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పన, లాటిన్ అమెరికా నిర్మాణంలో ఆయన పాత్ర ఎనలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్క్ ప్రసాద్, అంబేద్కర్ భవన్ ప్రతినిధి ఎన్.దేముడు, సాకేత్ ఫౌండేషన్ ప్రకాష్, కన్స్యూమర్ ప్రొటెక్షన్ అసోసియేషన్ టివి రమణ, అడమ్స్ స్కూల్ బి.వెంకటరావు, గణేష్ డిఫెన్స్ అకాడమీ గణేష్, వరలక్ష్మి ట్రస్ట్ మంగమ్మ, ప్రేమ సమాజం ప్రసాదరాజు, తదితరులు పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యాన

నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ, సిఐటియు నేతలు, చిన్నారులు

రాంబిల్లి : మండల కేంద్రంలో డివైఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యాన చే గువేరా 97వ జయంతిని ఘనంగా నిర్వహించారు. చే చిత్రపటానికి ఆయా సంఘాలత నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేవుడు నాయుడు మాట్లాడుతూ చేగువేరా అంటే, పోరాడే శక్తులకు ఎంతో స్ఫూర్తి అని, యువతకు ఆయన ఎంతో ఉత్తేజమని పేర్కొన్నారు. లాటిన్ అమెరికా ఖండంలో కార్మిక రాజ్యాల స్థాపన కోసం ఎన్నో త్యాగాలు చేసి, గెరిల్లా పోరాటాలు చేసిన విప్లవ యోధుడని తెలిపారు. చేగువేరా స్ఫూర్తితో నిరుద్యోగ యువత, కార్మికులు, తమ హక్కుల కోసం రాబోయే కాలంలో ఐక్య ఉద్యమాలు నడపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ఎరిపిల్లి రాము, ధోని కాశీయా, సిహెచ్ కచ్చేరి, పెద్దయ్య, నూకరాజు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడును కలిసిన పీలా గోవింద, రమణారావు తదితరులు

పలువురు మంత్రులకు జిల్లా నేతల సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి, కశింకోట

రాష్ట్ర మంత్రులుగా నియమితులైన కింజరాపు అచ్చన్నాయుడు, వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడులను శుక్రవారం అమరావతిలో అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యాన సత్కరించారు. అనకాపల్లి నూకాంబిక అమ్మవారి చిత్రపటాలను వారికి బహూకరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, టిడిపి బిసి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు, టిడిపి నాయకులు రామారావు, దాడి బుజ్జి, యల్లపు శ్రీనివాస్, పి సురేష్ చౌదరి, వేగి కృష్ణ, ఎస్.భానుచందర్, రమేష్, జొన్నాడ సురేష్, ప్రసాద్, కశింకోట మండలం అచ్చర్ల గ్రామ టీడీపీ అధ్యక్షులు నైనంశెట్టి రమణరావు, తాళ్ళపాలెం గ్రామ అధ్యక్షులు ఉల్లింగల రమేష్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

మెగా డిఎస్సిపై ఎపిటిఎఫ్ హర్షం

ప్రజాశక్తి-సబ్బవరం : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చుతూ మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు మొదటి సంతకంపై చేయడం పట్ల ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి లెక్కల హేమంత్ సుదేవ్ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో జీవో నెంబర్ 117 విడుదల చేసి రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసిందని, ప్రభుత్వం వెంటనే ఆ జీవోను రద్దు చేయాలని, ఏకోపాధ్యాయ పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా పున:ప్రారంభించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం, ఆదాయం

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రకృతి వ్యవసాయం విధానంలో పండించిన పంటల వల్ల ప్రజలకు ఆరోగ్యంతో పాటు పండించిన రైతుకు మంచి ఆదాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ లచ్చన్న పేర్కొన్నారు. అనకాపల్లి మండలం వెంకుపాలెం గ్రామంలో శుక్రవారం రైతులతో సామూహికంగా 1000 కేజీల ఘనజీవామృతం తయారు చేయించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ శిరసపల్లి అప్పలరాజు మాట్లాడుతూ ఈ ఘనజీవామృతం వల్ల భూమికి మంచి పోషకాలు అందుతాయని, దీనివల్ల రైతుకు యూరియా గాని డిఏపి గాని ఎటువంటి రసాయన ఎరువులు వాడనవసరం లేదని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన కూరగాయలు, ఆకుకూరలు, బియ్యం, బెల్లము పత్తితో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో మార్కెటింగ్ స్టాల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సిబ్బంది మజ్జి సత్యారావు, ముచ్చల అప్పారావు పాల్గొన్నారు.

ఘన జీవామృతం తయారీపై శిక్షణ ఇస్తున్న అధికారులు

సిమ్, ల్యాండ్‌లైన్ నెంబర్లకు ఛార్జీలు విధించొద్దు

ప్రజాశక్తి -అనకాపల్లి

కొత్త మొబైల్, ల్యాండ్ లైన్ నెంబర్లకు ఛార్జీలు విధించే ప్రతిపాదనలను టెలికాం నియంత్రణాధికార సంస్థ (ట్రాయ్) విరమించుకోవాలని కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ డిమాండ్ చేశారు. ఆర్థిక వనరులుగా ఫోన్ నెంబర్ల కేటాయింపును భావించడం తగదన్నారు. ఈ మేరకు ట్రాయ్‌కు పంపిన లేఖను శుక్రవారం ఆయన ప్రసార మాధ్యమాలకు విడుదల చేశారు. గతేడాది డిసెంబర్‌లో పార్లమెంటు ఆమోదించిన టెలికాం చట్టంలో ఉన్న మొబైల్ నెంబర్‌కు ఛార్జీ వసూలు చేయాలన్న నిబంధనను తొలగించాలని కోరారు. సిమ్ కార్డు, ల్యాండ్ లైన్ నెంబర్లకు ఛార్జీలు వసూలు చేయాలని ట్రాయ్ ఆదేశిస్తే, రిలయన్స్, జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా వంటి టెలికాం దిగ్గజాలు ఆ వ్యయాలను వినియోగదార్ల నుంచి వసూలు చేసే అవకాశం ఉందన్నారు. ఆయా కంపెనీలు వినియోగదార్లను పోస్ట్‌పెయిడ్ ప్లాన్‌లకు మారేలా ఒత్తిడి చేయవచ్చని పేర్కొన్నారు. ఒక నెంబరుకు ఒకేసారి (కనెక్షన్ ఇచ్చినప్పుడు) లేదా, ఏడాదికి ఒక నిర్దిష్ట కాలావ్యవధికి ఇంత అని ఛార్జీ వసూలు చేయాలన్న యోచన సమంజసం కాదన్నారు. కొత్త మొబైల్, ల్యాండ్ లైన్ నెంబర్లకు ఛార్జీలు విధించే ప్రతిపాదనలపై అభ్యంతరాలను advbbpa@trai.gov.in, jtadvbb-pa-1@trai.gov.in లకు ఈ మెయిల్ ద్వారా పంపాలని వెంకటరమణ సూచించారు. ఇందుకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం trai.gov.in/release-publication/consultation వెబ్‌సైట్‌ను సందర్శించాలని విజ్ఞప్తి చేశారు.

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి- అనకాపల్లి

సార్వత్రిక ఎన్నికల సమయంలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారుల పాత్ర మరువలేనిదని ఎస్పీ మురళీకృష్ణ, స్పెషల్ ఎన్ఫోర్స్మెంటు బ్యూరో కమిషనర్ ఎం రవి ప్రకాష్ కితాబిచ్చారు. ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులను అభినందిస్తూ ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సుమారు రెండు కోట్ల విలువగల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారన్నారు. జిల్లా ఎన్ఫోర్స్మెంట్ ఇంచార్జ్ సెబ్ బి.విజయభాస్కర్, ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ కె.జయసింహ చౌదరి, అనకాపల్లి ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ డి.అనిల్ కుమార్, నర్సీపట్నం ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ కె.సునీల్ కుమార్, ఎన్ఫోర్స్మెంట్ కానిస్టేబుల్స్ జి.ప్రసన్నకుమార్, సిహెచ్.వెంకటేశ్వరరావు, కె.సత్తిబాబు తదితరులు ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

మోడల్ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తేగాడ మోడల్ పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ మార్తి తిలకం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల విద్యార్థులు ఈనెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి- అనకాపల్లి

ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్య ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు చర్యలు తీసుకోవడం శుభ పరిణామమని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాయని అనకాపల్లి శాసనసభ్యుడు కొణతాల రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేదల కోసం ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే 5 హామీలు అమలు చేస్తూ సంతకాలు చేయడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. సామాన్యులు, పేదలు కోసం తిరిగి అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. తిరుపతిలో రాజకీయ ప్రమేయం లేకుండా ప్రక్షాళన దిశగా అడుగులు వేయడం మంచి పరిణామమని హర్షం వ్యక్తం చేశారు.

నాగజగదీష్‌కు సత్కారం

ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో కూటమి గెలిచేందుకు టిడిపి జిల్లా మాజీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు కృషి మరువలేనిదని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. కూటమి ఘన విజయాన్ని పురస్కరించుకొని శుక్రవారం తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో తుమ్మపాలకు చెందిన పార్టీ నాయకులు నాగజగదీశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాపేటి రామ్ కుమార్ పీలా సీతారాం పాల్గొన్నారు.

మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి- అనకాపల్లి : మునగపాక పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన జి.రామశేషు కుటుంబానికి శుక్రవారం ఎస్పీ మురళీకృష్ణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు ఒక రోజు డ్యూటీ అలవెన్స్ రూ.3,84,820 నగదు చెక్‌ను అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయ భాస్కర్, ఏఒ బి.శారద, కార్యాలయ సిబ్బంది వరలక్ష్మి, రాజేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్‌పి మురళీకృష్ణ

వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలు పాటించాలి

ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ద్వారా అందించే వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలను రైతులకు పాటించడం ద్వారా చీడపీడలు లేని ఆరోగ్యకరమైన పంటలు పొందవచ్చని ఆర్ఏఆర్ఎస్ ఏడిఆర్ డాక్టర్ పివికే జగన్నాధరావు పేర్కొన్నారు. ఆర్ఏఆర్ఎస్ జూబ్లీ హాల్‌లో శుక్రవారం పరిశోధన స్థానం అనకాపల్లి వాతావరణ విభాగం ఆధ్వర్యంలో వాతావరణం పంటలపై ప్రభావం అనే అంశంపై జిల్లా రైతాంగానికి అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ జగన్నాధ రావుతో పాటు విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సునంద, జిల్లా వ్యవసాయ అధికారి బి మోహనరావు హాజరై మాట్లాడారు. ఆర్ఏఆర్ఎస్ ద్వారా ప్రతి మంగళవారం వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలపై బులెటిన్ పత్రికల ద్వారా రేడియో ద్వారా రైతులకు చేరవేయడం జరుగుతుందని చెప్పారు. వివిధ పంటలపై వాతావరణ ప్రభావం, చీడ పీడల యాజమాన్యంపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారత వాతావరణ సంస్థ ముద్రించిన వరి చెరకు అపరాలు, నువ్వు పంటల్లో వాతావరణ ఆధారిత సాగు యాజమాన్య పద్ధతులు సూచనలు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఆదిలక్ష్మి, డాక్టర్ విశాలాక్షి, డాక్టర్ గౌరీ, డాక్టర్ పి శ్రీలత, జిల్లా శిక్షణ అధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్ఎఆర్ఎస్ శాస్త్రవేత్తలు

కూటమి మంచి పనులను జగన్ అడ్డుకోవడం తగదు

ప్రజాశక్తి-అనకాపల్లి
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన శాసనమండలి సభ్యులచే వ్యతిరేకించాలనుకోవడం తగదని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు పేర్కొన్నారు. స్థానిక లక్ష్మీనారాయణ నగర్ డివిఆర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని మాట్లాడడం ఆయన అవివేకాన్ని సూచిస్తుందన్నారు. రాజ్యాంగం, నిబంధనలు, చట్టాలపై కనీస అవగాహన ఉన్న ఏ వ్యక్తి ఇటువంటి మాటలు మాట్లాడరని పేర్కొన్నారు. తన ఓటమిని ఇంకా అంగీకరించలేని పరిస్థితుల్లో జగన్ ఉండడం బాధాకరమన్నారు. తన ఓటమికి గల కారణాలను సమీక్షించాల్సింది పోయి ప్రభుత్వం చేసే తప్పులను ఎండగట్టండని తన పార్టీల ఎమ్మెల్సీలకు చెప్పడం చూస్తుంటే ఇంకా జగన్లో మార్పు రాలేదన్నట్టు భావించాల్సి వస్తోందన్నారు.

ఓటమి చెందిన జగన్‌లో మార్పు లేదు : నాగజగదీష్
ఎన్నికల్లో ఓటమి చెందినా జగన్ రెడ్డిలో మార్పు రాలేదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండు రోజులే అయినప్పటికీ, రాష్ట్రంలో వైసిపి కార్యకర్తలు, నాయకులు దాడులు జరిగిపోతున్నాయని గగ్గోలు పెట్టడం చూస్తుంటే ఇప్పటి నుండే ప్రభుత్వంపై బురద జల్లడానికి, గోబుల్ ప్రచారాలు చేయడానికి సిద్ధమైనట్లు తెలుస్తోందన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు కోట్ని రామకృష్ణ, కుప్పిలి జగన్మోహన్, బోడి వెంకట్రావు, గుడాల సత్యనారాయణ, పోలిమేర నాయుడు, మల్ల గణేష్, దొడ్డి జగదీష్, కర్రి మల్లేశ్వరరావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి వీరభద్రరావు

మాట్లాడుతున్న కృష్ణవేణి

చంద్రబాబుకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం పట్ల చోడవరం బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు చోడవరం బార్ అసోసియేషన్ కార్యదర్శి గొర్లె కృష్ణవేణి శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వల్ల ప్రజలకు ఎన్నో సమస్యలు ఉంటాయని అప్పుడు బార్ అసోసియేషన్ నుంచి నిరసనలు తెలియజేశామని చెప్పారు. అయినా వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. యాక్ట్ రద్దు చేసిన సీఎం చంద్రబాబుకు చోడవరం బార్ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కొల్లి శ్రీనివాస్, గూనూరు లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై బాలికలకు అవగాహన కల్పించిన ప్రసాద్

ఆరోగ్యంపై బాలికలకు అవగాహన

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం గురుకుల పాఠశాల బాలికలకు ఆరోగ్యంపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య బోధకులు ప్రసాద్ మాట్లాడుతూ పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గ్రేస్, వైద్య సిబ్బంది సుబ్బారావు, నర్సింగరావు, అన్నమ్మ, ఆర్‌వి సత్య నారాయణ పాల్గొన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 8 అర్జీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా పోలీసు సిబ్బంది సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం వినతులు స్వీకరించేందుకు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో 8 మంది పోలీసు సిబ్బంది జిల్లా పోలీసు కార్యాలయానికి హాజరు అర్జీలు సమర్పించారు. ప్రధానంగా అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను జిల్లా ఎస్పీకి విన్నవించుకోగా, వారి విన్నపములను పరిశీలించి, సానుకూలంగా స్పందించి, అర్హమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ పాల్గొన్నారు.

రైతులకు వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : ప్రభుత్వం సరఫరా చేసిన వరి విత్తనాలు రైతుల సద్వినియోగం చేసుకోవాలని బుచ్చయ్య పేట సర్పంచ్ సుంకర లక్ష్మీ అన్నారు. వ్యవసాయ శాఖకు ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న వరి విత్తనాలను శుక్రవారం స్థానిక నాయకులతో కలిపి ఆమె రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సూరిశెట్టి వెంకటరమణ, గాడి సూరప్పారావు, సుంకర బాబ్జి, శనివాడ శ్రీనివాసరావు, జనసేన టిడిపి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ తదితరులు

ఆర్‌టిఐ చట్టంతో సమస్యల పరిష్కారం

పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న వెంకటరమణ

ప్రజాశక్తి- అనకాపల్లి
ఆర్టీఐ చట్టం సహాయంతో వినియోగదారుల హక్కులను పరిరక్షించుకోవచ్చని, తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఆర్టీఐ చట్టం రిసోర్స్ పర్సన్, రాష్ట్ర అవార్డు గ్రహీత కాండ్రేగుల వెంకటరమణ పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ అనకాపల్లి శాఖ ఆధ్వర్యంలో చేబోలు రామ్మూర్తి మెమోరియల్ లైన్స్ సర్వీస్ సెంటర్ హాలులో 'ఆర్టీఐ చట్టం-వినియోగం' అంశంపై శుక్రవారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రశ్నించేతత్వం పెరిగిన కొద్దీ ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం మరింత పెరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ రికార్డులను పరిశీలించుకునే హక్కు ప్రతి పౌరునికి ఉందన్నారు. కోరుతున్న సమాచారాన్ని సూటిగా, స్పష్టంగా దరఖాస్తుదారులు కోరాలని సూచించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వి.వెంకటరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్యదర్శి బి.అప్పలరాజు, సభ్యులు దారా జగన్నాధరావు, ఎన్.ఎస్.ప్రకాష్‌గుప్త, పూసర్ల సుధీర్, బి.పద్మరాజు పాల్గొన్నారు. అనంతరం కాండ్రేగుల వెంకటరమణ పేద విద్యార్థికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఇఒలు

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం
స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను శుక్రవారం ఎంఇఒలు ఎస్.లక్ష్మణరావు, బివిఎస్ మూర్తి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ తిరుపతిరావు మాట్లాడుతూ స్కూల్ బ్యాగులు, యూనిఫామ్ దుస్తులు రావాల్సి ఉందన్నారు. తమ పాఠశాలలో మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఈ నెల 13 నుండి 24 వరకు శక్తి ఆదా విద్యుత్తు పొదుపు చేయడానికి టీంలు ఏర్పాటు చేశామని చెప్పారు.

సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి -అనకాపల్లి
ప్రజా సమస్యలను పరిష్కరించడంలో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని జివిఎంసి 84వ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి అన్నారు. శుక్రవారం టిడిపి 84వ ఇంచార్జ్ మాదంశెట్టి నీలబాబుతో కలిసి ఆమె మాట్లాడారు. గత 5 సంవత్సరాలలో పరిపాలన తీరువేరని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, సచివాలయానికి వచ్చే సందర్శకులను గౌరవంగా రిసీవ్ చేసుకోవాలని, వారి సమస్య తెలుసుకొని, పరిష్కారానికి పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టెన్త్ మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి-చోడవరం : ఈ ఏడాది ఎస్ఎస్‌సి పరీక్షలలో మండలంలోని పివిఎస్.పేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన అనకాపల్లి కుమారస్వామి శుక్రవారం నగదు బహుమతులు అందించారు. జ్ఞాపికతో సత్కరించి, విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. కుమారస్వామి ధన్బాద్ ఐఐటిలో కంప్యూటర్ ఇంజనీరుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వివిఎస్‌ఎస్.శర్మ, మండల విద్యాశాఖ అధికారి సింహాచలం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నగదు బహుమతి అందిస్తున్న దృశ్యం

ఎన్‌డిఎ కూటమి శ్రేణుల సంబరాలు

ఎమ్మెల్యే పంచకర్లకు కేక్ తినిపిస్తున్న టిడిపి నేత గండి బాబ్జి

ప్రజాశక్తి- సబ్బవరం
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ఐదు పథకాలపై సంతకాలు పెట్టడంపై ఎన్‌డిఎ కూటమి నేతలు, కార్యకర్తలు శుక్రవారం సంబరాలు నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ జంక్షన్లో ఎన్టీఆర్ విగ్రహానికి పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి గండి బాబ్జి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం కేకును కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, సాలాపు వెంకటేశ్వరరావు, బర్రికాన బాబూరావు, కె రామకృష్ణంరాజు, రెడ్డి నారాయణరావు, మానవరపు అప్పలనాయుడు, పైల జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : ముఖ్యమంత్రి చంద్రబాబు ఐదు ఫైళ్ళపై తొలి సంతకం చేయడాన్ని హర్షం వెలిబుచ్చుతూ స్థానిక కూటమి శ్రేణులు శుక్రవారం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కొరుకొండ గోపీకృష్ణ, శరగడం జగన్, ఆడారి గోవిందా, సూరిశెట్టి అప్పలనాయుడు, కాండ్రేగుల శ్రీనివాసరావు, బేల లక్ష్మణరావు, బీర ఈశ్వరరావు,బి శెట్టి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

తగరపువలస : జివిఎంసి రెండో వార్డు సంగివలస, అల్లూరి సీతారామరాజు కాలనీలో టిడిపి నాయకులు, కార్యకర్తలు శుక్రవారం విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. కూటమి పార్టీలు ఘనవిజయం సాధించడం, ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఉపముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్, ఇతర మంత్రివర్గం ప్రమాణస్వీకారం చేయడం, ఇచ్చిన హామీల మేరకు ఐదు ప్రధాన వాగ్దానాలను నెరవేరుస్తూ సిఎం చంద్రబాబు సంతకాలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సిహెచ్ సాయి జయశంకర్, జోగ సన్యాసిరావు, బి రాజేశ్వరి, కె అప్పారావు పాల్గొన్నారు

ఈదురుగాలులతో భారీ వర్షం

కోటవురట్లలో పొంగి ప్రవహిస్తున్న తంగేడు గెడ్డ

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో పిడుగులతో కూడిన వర్షం కురవడంతో పలుచోట్ల చెట్లు విరిగి పడ్డాయి. ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. విద్యార్థులు, ఉద్యోగులు ఇళ్లకు చేరుకునేందుకు ఇబ్బందులు పడ్డారు.

బుచ్చయ్యపేట :మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపించగా, మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో వర్షం ప్రారంభమయ్యాయి. సుమారు గంటపాటు వర్షం కురిసింది. వ్యవసాయ పనులకు ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈదురు గాలులతో పలువురు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

గొలుగొండ: మండలంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. గొలుగొండ ఏపీ గురుకుల పాఠశాల సమీపంలో తాటి చెట్లపై ఉరుములు పడటంతో చెట్లు కాలిపోయాయి. దీంతో, అక్కడి ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ వర్షంతో ఖరీఫ్ రైతులు హర్షం వ్యక్తం చేశారు. కొమ్మిక పంచాయతీలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.



గొలుగొండలో పిడుగు పడి దగ్ధమవుతున్న చెట్టు

రోడ్డుపై కూలిన చెట్టు

కశింకోట : శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో వీచిన భారీ ఈదురుగాలులు, కుసిన వర్షానికి మండలంలోని తాళ్లపాలెం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద తాళ్లపాలెం- నర్సీపట్నం రోడ్డుకు అడ్డంగా భారీ వృక్షం కూలిపోయింది. దీంతో రోడ్డుకు రెండు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. గాలి వర్షం వల్ల చెట్టును తొలగించడానికి ఆటంకం ఏర్పడింది. సుమారు గంటన్నర పాటు ట్రాఫిక్ నిలిచింది. విద్యుత్ స్తంభంపై కొమ్మలు పడి విద్యుత్ వైర్లు తెగి పడ్డాయి. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సంఘటనా స్థలానికి కశింకోట సిఐ వినోద్ బాబు వచ్చి జెసిబి సహాయంతో చెట్టును తొలగించారు. దీంతో వాహనాల రాకపోకలు సాగాయి. నిత్యం ఆ చెట్టు వద్ద ప్రజలు ఉంటారని, అయితే చెట్టు కూలే సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

పనులు చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులతో పనులు

-జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘటన

ప్రజాశక్తి - మాడుగుల : మాడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో విద్యుత్ సంబంధించిన పనులను చేయించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుని గదికి సంబంధించి ఏసి మరమ్మత్తు పనుల నిమిత్తం విద్యార్థుల ఉపయోగించడంపై పలువురు విమర్శిస్తున్నారు. ఇదే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలో తరగతి గదులను పునరుద్ధరించడానికి విద్యార్థులతో పనులు చేయించినప్పుడు ఒక విద్యార్థి మృతి చెందడంతో పాటు మరో విద్యార్థి కాలు విరిగిన సంఘటనలు కూడా చోటు చేసుకుంది. మరల విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు రోజులు కూడా కాకముందే విద్యార్థులను పనులకు ఉపయోగించడం విశేషం. ప్రమాదకరమైన విద్యుత్ సంబంధిత సైడ్ పై నుండి విద్యార్థులతో పనులు చేయించడంపై పలువురు విమర్శిస్తున్నారు.

19న గొలుగొండ మండల సమావేశం

ప్రజాశక్తి-గొలుగొండ:ఈ నెల 19న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రత్నకుమారి తెలిపారు. ఎంపీపీ గజ్జలపు మణికుమారి అధ్యక్షతన మధ్యాహ్నం 2.30 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి సర్పంచ్ లు, ఎంపిటీసీలు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె కోరారు.

అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మలేరియాపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-రోలుగుంట:మలేరియా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం రోలుగుంట మండలం బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రత్నంపేట గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా నివారణ సూచనలు, సలహాలపై ప్రచారం చేశారు. దోమ తెరలు తప్పని సరిగా వాడాలని, నిల్వ ఉన్న వస్తువులు, కొబ్బరి బొండాలు, పాత టైర్లలో నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ నూకరాజు, హెచ్ఎస్ రమాకాంతారావు, హెచ్వి సన్యాసమ్మ, ఏఎన్ఎం సుజాత, ఆశలు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

డిఎల శిరీషా రాణి

ప్రజాశక్తి- కొత్తకోట:వర్షాలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో అంటువ్యాధులు, రోగాలు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగు పరచడంపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారిని శిరీష రాణి ఆదేశించారు. కొత్తకోట, రావికమతం పంచాయతీలలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కొత్తకోట, రావికమతం పంచాయతీ పరిధిలోని సంపద కేంద్రాన్ని పరిశీలించి నిరుపయోగంగా ఉండటంపై పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్ని ప్రశ్నించారు. వెంటనే వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న డ్రైన్ మూసుకుపోయి నీరంతా తమ ఇంటిలోకి వస్తుందని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కొత్తకోట గ్రామానికి చెందిన కొల్లూరు వెంకటరత్నం డీపీవోకు పిర్యాదు చేయడంతో ఆమె పరిశీలించారు. కాలువ ఆర్అండ్బి పరిధిలో ఉందని సర్పంచ్ లోవరాజు వివరించగా... పంచాయతీ నుంచి ఆర్ అండ్ బి కు దరఖాస్తు చేయాలని, అంతవరకు ప్రొక్లెయిన్ సహాయంతో తాత్కాలికంగా పనులు చేపట్టాలని కార్యదర్శికి ఆదేశించారు.గ్రామాలలో పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్ డి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశీలిస్తున్న డిఎల

త్వరలో మేయర్‌ను కూడా దించేస్తాం

- టిడిపి దక్షిణ ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్

ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్:త్వరలో జివిఎంసి మేయర్‌ను పదవి నుంచి దించేస్తామని టిడిపి దక్షిణ నియోజకవర్గం ఇంచార్జ్ సీతంరాజు సుధాకర్ అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, మేయర్ పాలనలో అవినీతి విపరీతంగా పెరిగిందన్నారు. కొన్ని సాంకేతిక మార్పులు జరిగాక మేయర్ పదవి నుంచి వైదొలగడం తథ్యం అన్నారు.ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలపై సిఎం చంద్రబాబు సంతకాలు పెట్టి రుజువు చేశారన్నారు. తిరుపతిలో అన్న ప్రసాదాన్ని కూడా నాణ్యత లేకుండా జగన్ రెడ్డి చేశారని విమర్శించారు. సిబిసిఎన్ సి క్రిస్టియన్ల స్థలంలో మాజీ ఎంపీ ఎంబీబీ సత్యనారాయణ నిర్మిస్తున్న, అపార్ట్మెంట్ పనులను నిలుపుదల చేస్తామన్నారు. అక్కడ ఇల్లు కొనుగోలు చేయవద్దని ముందుగా చెప్తామన్నారు.ఆ విధంగా కొనుగోలు చేసిన వారికి నష్టం జరగకుండా ప్రభుత్వం నుంచి తగు హామీ వచ్చేలా చూస్తామని భరోసా ఇచ్చారు. హయగ్రీవ, దసపల్లా భూముల దోపిడీ వ్యవహారంపై దర్యాప్తు చేయిస్తామన్నారు. ఐదు ఏళ్లలో ఆర్థిక పరిస్థితిని జగన్ చిన్నాభిన్నం చేసేసాడని విమర్శించారు.టైకూన్ దగ్గర రోడ్డు డివైడర్ తొలగించి ప్రజలకు విముక్తి కలిగించామన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ అధ్యక్షుడు దత్తి రాజశేఖర్, విల్లూరి చక్రవర్తి, కార్పొరేటర్లు జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-మాడుగుల:మాడుగుల మండలం నరసన్నపేట ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర హాస్టల్లో విద్యార్థులు చేరేందుకు ఖాళీలు ఉన్నట్లు ప్రధానోపాధ్యాయుడు భావరాజు శుక్రవారం ప్రకటన లో పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలలో 3వ తరగతి నుండి 8వ తరగతి వరకు 135 వరకు సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆయన తెలిపారు. విద్యార్థులకు అన్ని వసతులు ఉన్నాయన్నారు.గుణాత్మకమైన విద్యభ్యాసం అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఫోన్: 8688525042 నెంబర్కు సంప్రదించాలని ఆయన కోరారు.



అంధకారంలో ఉన్న గ్రామం

వీధి దీపాల మరమ్మతు చేపట్టరూ...

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం జె.నాయుడుపాలెం ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలుగక స్థానికులు అంధకారంలో ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయు జిల్లా నాయకులు ఈరెల్లి చిరంజీవి తెలిపారు. ఆయన మాట్లాడుతూ, ఈ గ్రామంలో సుమారు 250కి పైగా కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. గత నాలుగు నెలల నుండి వీధి లైట్లు వెలగ లేదన్నారు. అధికారులు దళితవాడలో సమస్యలు పట్టించుకోలేదని విమర్శించారు. ఇంటింటి కొళాయిలు సక్రమంగా వేయలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు , నాయకులు స్పందించి జె.నాయుడుపాలెం ఎస్సీ కాలనీపై దృష్టి సారించి సమస్యలు పరిష్కారం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పోర్టు ఛైర్మన్‌కు కాలుష్యంపై వినతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: పోర్టు పరిసర ప్రాంతాల్లో కాలుష్య నివారణ పై తగిన చర్యలు తీసుకోవాలని పోర్ట్ ఛైర్మన్ డాక్టర్ మాదయ్యన్ అంగముత్తుకు దక్షిణ జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఆయన పోర్టు ఛైర్మన్ కు వినతి పత్రం సమర్పించారు. పోర్టు ఆవరణలో నివసించే జనావాస ప్రాంతాల్లో కాలుష్యంతో దక్షిణ నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొబ్బరి తోట ప్రాంతం నుంచి పెద్దరోడ్డు వరకు ఆధునీకరించిన కాలువకు ఇరువైపులా గ్రీనరీ ఏర్పాటు చేయాలని, సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా కమ్యూనిటీ హాల్స్ నిర్మించాలని కోరారు. అనంతరం పోర్ట్ ఛైర్మన్ ను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ, పోర్టు అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తానని తెలపడం పట్ల ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పాలాభిషేకం చేస్తున్న విజయ్

ఎన్‌టిఆర్ విగ్రహానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:వివాదస్పదమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రద్దు చేయడం హర్షణీయమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. నర్సీపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విజయ్ హాజరై మాట్లాడారు. న్యాయవాదులు చేసిన ఆందోళన ఫలితమే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేయడమన్నారు.

నేడు హోం శాఖ మంత్రి అనిత రాక

ప్రజాశక్తి -నక్కపల్లి: రాష్ట్ర హోం శాఖ, విపత్తుల నిర్వహణ మంత్రి వంగలపూడి అనిత ఈనెల 15న శనివారం పాయకరావుపేట రానున్నారు. ఈ మేరకు పార్టీ నేతలు స్వాగత ఏర్పాట్లపై నిమగ్నమయ్యారు. సాయంత్రం 3 గంటలకు పాయకరావుపేటలో పాండురంగ స్వామిని దర్శించుకుని, అక్కడి నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా ఉపమాక చేరుకుని, వెంకన్నను దర్శించుకుంటారని టీడీపీ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గంలో అత్యధిక భారీ మెజారిటీతో అనిత విజయం సాధించి, రికార్డు సృష్టించారని సంతోషం వ్యక్తం చేశారు.పాయకరావుపేట నుండి రానున్న అనిత కు జాతీయ రహదారిపై మీదుగా అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆమెకు ఘన స్వాగతం పలకాలని కోరారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అనితకు ఘన స్వాగతం పలకాలి

కోటవురట్లలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-కోటవురట్ల: సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన పాయకరావుపేట ఎమ్మెల్యే అనిత హెూం శాఖ మంత్రిగా మొట్టమొదటి సారిగా నియోజక వర్గానికి వస్తున్న సందర్భంగా జనసేన పార్టీ శ్రేణులు ఆమెకు భారీ స్వాగతం పలికేందుకు తరలిరావాలని ఆ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు సింగంపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పాయకరావుపేట నుంచి ఉప్మాక వెంకటేశ్వర స్వామి గుడి వరకు భారీ ర్యాలీతో వస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు భాస్కరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కపల్లి: కూటమి ప్రభుత్వంతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. నక్కపల్లి లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, టీడీపీ, జనసేన, బీజేపీల కలయికను రాష్ట్ర ప్రజలు స్వాగతించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన వెంటనే 5 ప్రధాన ఫైల్స్ పై సంతకం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంకుల రాజు,మీగడ సత్తి బాబు పాల్గొన్నారు.

నక్కపల్లిలో మాట్లాడుతున్న నాయకులు